
# శత్రువు

**ఈవారం కథ**

మరోసారి వీథివైపు చూశాను.

నగరం చచ్చిపోయింది. శతసహస్ర వాహనాల కదలికతో కొట్టుకునే నగర హృదయం ఆగిపోయి వుంది.

అటూ, ఇటూ చూసి రెండడుగులు ముందుకు వేశాను. నా పాదాల సవ్వడికి నాకే భయం వేసింది.



— ఎల్.ఆర్.స్వామి

కర్ఫ్యూ అమలుపరచే పోలీసుల చేతికి చిక్కకుండా, మతోన్మాదుల కంటపడకుండా యిల్లు చేరగలనా?

ఒక్క నక్షత్రము కూడా కనపడని ఆకాశం కర్ఫ్యూ అమలులోవున్న నగరంలోనే వుంది. కరిమబ్బు వెనుకదాగి, అప్పుడప్పుడు బయటకు వస్తూ పయనిస్తున్న చంద్రుడు, నా ప్రతిబింబంలా కనిపించాడు.

హఠాత్తుగా ఆగిపోయాను నేను. ఏదో అలికిడి అయినట్లనిపించింది. కళ్ళు చిట్లించి మళ్ళీ, మళ్ళీ చూశాను. చీకట్లో ఏమీ కనిపించలేదు.

ఏ కుక్క అయినా అయి వుండవచ్చని అనుకున్నాను. ఏ నవాబో కట్టించిన, శిథిలమైన ఆ కోటలో కుక్కలు, గబ్బిలాలు, ఇతర పక్షులు నివాసం ఏర్పరచుకొని వుండవచ్చును.

జాగ్రత్తగా అడుగులు వేశాను. వీథి గుమ్మానికి దగ్గరగా ఉన్న స్తంభం దాటుతూ వుంటే కాళ్ళకి ఏదో మెత్తగా తగిలింది.

తుళ్ళిపడ్డాను నేను. ఏ పామువైనా తొక్కలేదు కదా? నేల మీదకు వంగి జాగ్రత్తగా చూశాను.

నేల మీద ఎవరో కూర్చుని వున్నారు!

'మీరు" లేస్తూ అడిగేడు అతను. "మీ పేరు..." అతనిగొంతులో కంగారు, భయము వ్యక్తమవుతోంది.

"మీ పేరు..." "నేను ఎదురు ప్రశ్న వేశాను. మనిషి, మనిషిని నమ్మలేని రోజులు! ఎదురుగా నిలబడిన వ్యక్తి నా మతానికి చెందిన వాడా, కాదా అని తెలుసుకోవడం అతి ముఖ్యం., అది తెలిస్తే కానీ జీవితము సుర క్షితమా? కాదా? అని తెలియదు నగరమంతా మతకలహాలతో అల్లకల్లోలముగా వుంది.

"పేరుతో పని ఏముంది లెండి" నాలాగే పేరు చెప్పడం ఇష్టంలేని అతడు అడిగాడు." పోనీ మీరు ఎక్కడ వుంటున్నారు? పాత బస్తీయా...

అతని ఎత్తు నా కర్థం అయింది. నగరంలోని ప్రాంతాలలో ఏదో ఒక మతముకు చెందిన వారే ఎక్కువగా వుంటారనే వాస్తవాన్ని ఆయుధంగా వాడుతున్నాడతను.

"మీ భయం నాకర్థమైంది. మీ మతం ఎక్కడ తెలిసి పోతుందోనని భయపడుతున్నారు కదూ?" నేను జవాబు చెప్పకపోవడంతో అతనన్నాడు "నాకు మీ మతంతో పని లేదు. ఓ మనిషిగా తోడుంటారేమోనని అనుకున్నాను. నా ప్రాంతమువారయితే కలసి వెళ్ళవచ్చు కదా ననేది నా ఆశ"

అతను నాకు దగ్గరగా జరిగేడు. చీకట్లో అతని ముఖం కనిపించలేదు. కానీ, అతని చేతిలోవున్న చిన్న పెట్టె స్పష్టంగా కనిపించింది.

ఆ పెట్టెలో పిస్టల్ 'వుంటుందేమో! బహుశా నాటు బాంబులు కూడా వుండవచ్చు.

నేను వెనక్కి జరిగేను. మరోదారి నుంచి పరుగెడితే...

అతను అది గమనించినట్లున్నాడు.

"ఆగండి" అతనన్నాడు. "భయపడకండి. నేను దొంగనూకాను, మతోన్మాదిని అంతకన్నా కాను. ఉద్యోగంచేసి

7-10-94 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక

బ్రతికే మామూలు కార్మికుడిని"

కార్మికుడా?

"... ... కంపెనీలో మెకానిక్‌ని

"నేనూ మెకానిక్‌నే"

అతను మరీ దగ్గరకు జరిగేడు. నాకు భయం వెయ్యలేదు.

ఏవేవో చెబుతున్నాడు అతను. వాళ్ళ కంపెనీలో కేంటీన్ భోజనం అసలు బాగోదట. రోజూ ఇంచుమించు పది గంటలు పని చెయ్యాలట. అయినా జీత, భత్యాలు చాలా తక్కువేనట.

"మీకు బోరుకొడుతోంది కాబోలు" ఏమీ మాట్లాడకుండా నిలబడ్డ నన్ను చూసి అతను అన్నాడు" పదండి మెల్లగా, ముందుకు వెళదాము"

అడుగులో అడుగు వేసి ముందుకు నడిచాము.

కర్ఫ్యూ అమలుపరిచే పోలీసులు వీథిలో లేరని నిర్ధారణ చేసుకున్నాక, రోడ్డు మీదకు అడుగు పెట్టాము. ఒక్క కిలో మీటరు దూరం నడిచామో, లేదా దగ్గరలో పిస్టల్ పేలిన శబ్దం వినిపించింది.

ఎవరిదో ఆర్తనాదం.

"అల్లా హో అక్బర్" అతను ఓ నిముషం ఆగి అన్నాడు" దగ్గరలోనే ప్రమాద ముందన్నమాట–"

నా గుండె ఆగిపోయింది. నాతో నడుస్తున్న అతను ముస్లిమ్ అని తెలిసి భయంపుట్టుకొచ్చింది. నేను హిందువునని అతనికి తెలిస్తే...

అతని పెట్టెలో పిస్టల్ వుండవచ్చు.

ముందుకు పరుగు తీశాను.

"ముందర ప్రమాదముంది" అతను నన్ను వెనక్కు లాగుతూ అన్నాడు. "పిస్టల్ పేలింది కదా? ఎవరినో చంపి వేసినట్లున్నారు."

అతని నుంచి దూరంగా పారిపోవడానికి ప్రయత్నించాను. కానీ, కుదరలేదు. బలవంతంగా ఓ చెత్త కుండీ దగ్గరకు లాక్కు వెళుతూ అన్నాడు.

"వెధవ నగరం. మనిషిని ధైర్యంగా నడవనివ్వడం లేదు"

"అంతా మీ వాళ్ళదయే కదా?" నేను కోపంగా అడిగేను. "గొడవ మొదలు పెట్టిందిమీ వాళ్ళే కదా?"

"మా వాళ్ళేమిటి, మీ వాళ్ళేమిటి?" చెత్త కుండీ వెనుక దాక్కుంటూ అన్నాడు అతను. "ఎవరో కొంతమంది స్వార్థపరులు చేసే పనులకు బాధ్యత మనదా? ఏదో కాయకష్టం చేసి బ్రతుకుని ఈడ్చే వాళ్ళం మనకూ, మనకూ గొడవ లేమిటి? కక్షలేమిటి"

దూరం నుంచి పోలీసు జీపు వస్తున్న శబ్దం వినిపించింది. జీపు బల్బుల కాంతికి కనబడి పోతామేమోనని భయం వేసింది.

మరికొంత దగ్గరగా కూర్చున్నాము. ఇద్దరము.

"అప్పుడే అర్థరాత్రి దాటిపోయింది" అతను నిట్టూర్చాడు.

జీపు లైట్ల కాంతిలో వాచీ చూసుకున్నాడు.

"నేనింకా ఎప్పుడు ఇల్లు చేరతానో, మా పిల్లలు కొత్త బట్టలు ఎప్పుడు వేసుకుంటారో!" కర్చీఫ్‌తో కళ్ళు వత్తుకున్నాడు అతను. "ఈ రోజు మధ్యాహ్నం దాకా అప్ప యివ్వలేదు ఆఫీసులో. నిన్ననే యిచ్చివుంటే రంజాన్‌కి యిల్లు చేరుకొనేవాడిని. పిల్లలు కొత్త బట్టలు వేసుకునేవారు" అతని గొంతు జీర బోయింది.

నాకు జాలివేసింది. పండగకు వస్తానన్న నాన్నకోసం ఎదురు చూసి, చూసి అలసిపోయి బరువెక్కిన కళ్ళతో నిద్రపోయే అతని పిల్లల దయనీయమైన మొహాలు నా మదిలో కదిలాయి!

"ఈ కర్ఫ్యూలో నేను మాత్రం నరదాగా బయలుదేరానా?" నా బాధ కట్టలు తెంచుకుని ప్రవహించింది. "మా ఆవిడకు తొలికాన్పు కష్టంగా వుందని ఫోను వస్తే బయలుదేరాను. ఎలా వుందో, ఏమో?" నేను రోడ్డు వేపు దృష్టి మళ్ళించాను. అంతా చీకటే.

"ఉన్న సమస్యలతోనే వేగలేక పోయే మనకి, ఈ మత కలహాలేమిటి, మత విద్వేషా లేమిటి?" అతనన్నాడు.

ఇద్దరమూ లేచాము. ముందుకు నడుస్తూ వుంటే అతను అన్నాడు "ఆగండి రెండు బిస్కట్లు తినివెళదాము"

నేను జేబులోంచి అగ్గిపెట్టె తీసి వెలిగించాను. పెట్టె తెరిచాడు అతను. ఆ పెట్టెలో అమర్చిన కొత్త బట్టలు ఒక ప్రక్కకు జరుపుతూ అన్నాడు. "ప్రతీ సంవత్సరమూ రంజాన్ చంద్రుడు కనబడకముందే యింట్లో వుండేవాడిని! బిస్కట్ పేకట్టు బయటకు తీశాడు అతను.

రెండు బిస్కట్లు తిని నీళ్ళు తాగితే కొంత ఉత్సాహం కలిగింది.

మళ్ళీ నడక ప్రారంభించాము.

నాకు ధైర్యంగా వుంది. నాతో మరో మనిషి వున్నాడనే ఆ ధైర్యానికి కారణం.

"ఇంక నేను వెళతాను" నాలుగు వీథుల కూడలికిరాగానే అన్నాడు అతను. ఆ కూడలి నుంచి కుడివైపు తిరిగితే అతని ఇల్లు వస్తుందట!

హైదరాబాదు నగరం బాగా అలవాటయిన నాకు అతని ఇల్లు ఎక్కడ వుంటుందన్నది ఊహించడం కష్టం కాలేదు.

"ఇంక నాకు భయం లేదు. వీథి వైపు తిరుగుతూ అన్నాడు అతను" ఇక్కడ అంతా మా వాళ్ళే. మీరు జాగ్రత్త"

అతను ముందుకు నడిచేడు. నేను నా దారిన అడుగులు వేశాను. మళ్ళీ పిస్టల్ పేలిన శబ్దం వినిపించింది. హఠాత్తుగా ఆగిపోయాను. చుట్టూ చూశాను. చిమ్మ చీకటి! ఏమీ కనిపించలేదు.

అగ్గివుల్ల వెలిగించి చూశాను. నాకు కాళ్ళూ, చేతులు ఆడలేదు.

నేల మీదకు ఒరిగి పోతున్నాడు అతను. అతని చేతిలోని పెట్టెను లాగేసుకుని పరుగెడుతున్నాడు ఒకడు.

ఒక్క నిముషం అలాగే వుండిపోయాను. ఆ తరువాత వెనక్కు తిరిగి కుడివైపు రోడ్డు మీద పరుగెత్తాను అతని ఇంటికి .

అప్పుడు నేను ఒక హిందువునన్నది కానీ, నేను వెళుతున్నది ఒక ముస్లిమ్ ప్రాంతానికనేది కానీ, నగరం హిందూ, ముస్లిం గొడవలతో మండి పోతోందన్నది కానీ, నాకు భయం కలిగించలేదు.

ఎందుకంటే –

నా నిజమైన శత్రువు ఎవరన్నది నాకు తెలిసిపోయింది కనుక.

◇

ఓ కాలేజీ లెక్చరర్ రాస్తున్న సీరియల్

స్వీట్ సెక్స్‌టీన్

త్వరలో...